

# స్వయం సేవ

రంభా దర్శన భాగ్యంకోసం ఘోర తపస్సు చేస్తుంటే రాజకుమారుడికి కళ్లు తెరవగానే, ఎదురుగా బ్రహ్మరాక్షసి కనపడితే ఎలావుంటుందో అలాంటి సంకట స్థితిలో పడిపోయాడు పాపం వేణు! విధి విలాసం ఇంతేనేమో! కాకపోతే తాను ఎవరికోసం ఇంత ఆతృతతో ఎదురు చూస్తున్నాడో వారికి మారుగా తాను ఎవరినైతే పూర్తిగా ఏవగించుకుంటాడో వాళ్లే తన కళ్ళఎదుట ప్రత్యక్షంగా నిలచివుండటం బలవత్తరవిధి దుర్విపాకం అనకపోతే ఏమనుకోవాలి?

నిజానికి వేణు ఎదురుచూస్తున్నది లత ఆగమనంకోసం. "సాయంకాలం ఐదింటికల్లా నీ రూంకు తప్పకుండా వచ్చేస్తాగా," అని గట్టిగా వాగ్దానం చేసిందికూడా. ఇప్పుడు ఐదు కావస్తోంది. వేణు స్టైలిష్‌గా టాయ్‌లెట్ చేసుకొని నాలుగింటినుండి తయారుగా వున్నాడు. దృష్టంతా ద్వారంవైపే కేంద్రీకరించి మధ్యమధ్య గోడగడియారం వైపు చూస్తూ కూచున్నాడు. ఇంతలో తలుపుమీద 'టకటక' శబ్దం మెల్లిగా వినవచ్చింది. ఆతృతతో ఒక్క దూకులో వెళ్లి తలుపుతీశాడు. "ఇంత ఆలస్యంచేశావేం?" అందామని నోరు కూడా కొంచెం తెరిచాడు. కాని అతని కళ్లబడ్డ దృశ్యం అతన్ని చైతన్యహీనుణ్ని గా చేసింది. అతనినోట మాటరాలేదు. ఆనందంతో విలసిల్లే అతని సుందరవదనం ఒక్కమారు పాలిపోయింది. అతని ఎదురుగా లతకు మారుగా ఒక వృద్ధపురుషుడు ఆయన ననుసరించి ఒక వృద్ధనారి-పార్వతీ పరమేశ్వరుల్లాగా తనవైపు చూస్తూ నిలచివున్నారు!!!

ఈ పురాణదంపతు లెవరో? ఇంత ఆకస్మికంగా తనకెందులకు దర్శనమిస్తున్నారో పాపం వేణుకు అగమ్యగోచరంగానే వుంది.

"ఎవరు కావాలండీ తమకు?". అని కొంచెం వ్యంగ్యంగా చిరాకు, కోపం ఎక్కువగా వ్యక్తపరచకుండా అడిగాడు. అతనికి ఈ "ముసలిజంట" ఏదో రూం నెంబరు తప్పిపోయి ఇటువచ్చారేమోననే ఆశాపూరిత అనుమానం కలిగింది.

"మీకోసమే లేండి" అంటూ ఆ పరమేశ్వరుడుగారు సమాధానమిస్తూ, సరాసరి గదిలోకి దోవతీసేటప్పటికి వేణు నిజంగానే నిరుత్తరుడయ్యాడు.

ఆ పార్వతీదేవిగారుకూడా నడుముమీద చెయ్యిపెట్టుకొని వంగి వేణుని ఆపాదమస్తకం పరిశీలిస్తూ, పరమేశ్వరుడి వెంబడే లోనికి ప్రవేశించింది.

ఊహాతీతమైన వీరి చర్యకు వేణుకి కోపం మిన్నుముట్టింది. కాని సభ్యతకు లక్షణం కాదని, "దయచేయండి" అంటూ కుర్చీలు చూపాడు. కాని ఈ శబ్దోచ్చారణ సూక్ష్మంగా పరిశీలిస్తే "ఇప్పుడెందుకు వచ్చారు? దయచేసి బయటకు నడవండి" అనేట్లుగానే వుంది! వారు సుఖాసీనులైన తర్వాత, వేణు చేసేదేమీ లేక ఒక సోఫాలో కూలబడ్డాడు. కాని అతని మస్తిష్కంలో అనేక భావతరంగాలు నిర్విరామంగా పరిభ్రమింపసాగినయి.

సాధారణంగా ఇలాంటివృద్ధ — మధ్యవయస్క దంపతులు తనలాంటి తరుణ బ్రహ్మచారులవెంట ఎందుకు పడతారు?... బహుశా తమకు సౌభాగ్య కాంక్షిణికన్య ఒకతెవుండి—ఆమెను తమ కంఠసీమకు బంధించేందుకు ప్రయత్నిస్తూ ఇలా సంచారంగా వస్తూవుంటారని తెలికగానే నిర్ణయించేశాడు, ఆ వచ్చినవారు తమకూ—తన పెద్దలకుగల స్నేహాన్ని పురస్కరిస్తూ వారికీ తమకు ఎంత గాఢస్నేహముండేదో తన బాల్యంలో వారితో తాను ఎంత చనువుగావుంటూ వారిని తన ఆటమాటలతో ఎంత మురిపింప చేసేవాడో ఇలాంటివన్నీ రమ్యంగా కల్పించి వర్ణిస్తూ అతి నేర్పుతో తనను గురించిన ప్రస్తుత

★ మా నూరు రా

వివరాలన్నీ సేకరిస్తారు. చిట్టచివరికి తమ ఏ సరస్వతినో—సత్యవతినో-భానుమతినో-వచ్చి చూసి తమ కుటుంబ శాశ్వత సభ్యత్వాన్ని స్వీకరించ వలసినదిగా ఆహ్వానిస్తారు. ఇదే వారి నిరంతర కృషి. ఇలాంటి




వారిని ఇప్పటికే చాల మందిని చూశాడు. కాని లతతో పరిచయమైనప్పటినుండి ఇలాంటి వరాన్వేషణలతో వృధాగా కాలవ్యయం చేయటం వేణుకేమాత్రం యిష్టం లేదు. అందులో ఇతరులతో తన భోగట్టా తెలియచేయాలంటే అతనికి చాల

మక్కపా రావు ★

కోపం. ఇతరులకే కాదు—తన ప్రాణతుల్యమైన లతకే తనను గురించి ఇంతవరకు యే వివరము కూడా తెలుపలేదంటే అతని స్వభావము ఎంత విచిత్రమైనదో తెలుసుకోవచ్చును. అతనిది అంత పెంకె పట్టుదల.

ఒకరోజున యేదో మాటల సందర్భంలో లత వేణుని "మీ జీతమెంతండీ?" అని అడిగింది. ఇదైనా అతనితో తనకు ఇటువంటి ప్రశ్న అడుగగల సన్నిహిత స్నేహం ఏర్పడినదనే ధైర్యం కలిగిన తర్వాతనే అడిగింది. కాని దీనికి వేణు సమాధానం విన్న తర్వాత చాల ఖిన్నురాలయింది.

"ఏం? నా జీతం తప్సీలు నీ కెందుకు? నా జీతం ప్రమాణాన్ని బట్టి నన్ను పెళ్లాడటంగాని, మానుకోటంగాని నిశ్చయించుకుందామనుకుంటున్నావనుకుంటాను." అని నిష్ఠురంగా జవాబిచ్చాడు.

అసలు లతకు వేణుతో చాల వింత పరిస్థితిలో పరిచయమైంది. సిటీబస్ ఫియాసికల్ బిల్డింగ్ స్టాపింగ్‌లో ఆగిన వెంటనే లత బస్ ఎక్కింది. కండక్టర్ ఇక ఖాళీ లేదని రైట్ చెప్పటం బస్ బయలుదేరటం వక్కమారే జరిగి పోయింది. ఆ వూపులో లత బ్యాలెన్సు తప్పి ఎదురసీట్లో కూర్చున్న యువకుడి మీద పడిపోయింది. అతను లేచి ఆమెను తన సీటులో కూర్చోమని చెప్పి ఫుట్‌బోర్డుమీద నిలబడ్డాడు. లత సిగ్గుపడుతూనే థాంక్సు చెప్పికూర్చున్నది. ఆతర్వాత రెండు రోజులకు లత అక్కడే బస్ ఎక్కింది. వేణు అదే సీట్లో వున్నాడు. లతను చూడగానే అతను నిలబడి లతకు సీటు యిచ్చాడు. "మళ్ళా మీద పడ్తానని భయంతో ముందే జాగ్రత్త పడుతున్నారల్లే వుంది?" అని లత నవ్వుతూ అంటూ కూర్చున్నది. ఈ విధంగా ప్రారంభమైన వారి స్నేహము దినదినాభివృద్ధి చెందుతూ వచ్చింది. క్రిష్టియన్ కాలేజి దగ్గర లత దిగిపోయేది. రోజూ వాళ్ళిద్దరు కలుసుకుంటూనే వుండేవారు. లత కాలేజీలో విద్యార్థిని అని వేణు తెలుసుకున్నాడు. కాని అతను ఏం చేస్తున్నాడో లతకు ఇంతవరకు తెలియలేదు. అతను తెలుపలేదు. కాని అతను చాలా మంచివాడని, ప్రేమాస్పదుడని మాత్రము తెలుసుకొనకలిగింది. అతనిని గురించి వివరాలు తెలుసుకోవాలని లత ప్రయత్నించింది. కాని తామిరువురు ఒకే కులమువారనే విషయముతప్ప ఇంకే విషయము తెలుసుకొనలేకపోయింది.

ఒకరోజు వేణు రూంకి వచ్చినప్పుడు లత నవ్వుతూ: "ఏమండీ-ఎప్పుడూ నేను మీ రూముకు రావటమేకాని, ఇంతవరకు మీరు ఒక్కమారు కూడా మా ఇంటికి రాలేదు. రేపు తప్పకుండా 'టీ' కి మా ఇంటికి రావాల్సిందే" అంది.

"ఇప్పుడే కాదు," అన్నాడు వేణు.

"మరెప్పుడు?" అన్నది లత.

"మన పెళ్ళి అయిన తర్వాతనే."

"ఎలాగూ అల్లుడు అవుతాయుగదా? ఒక్కమారు మా ఇంటికి రాకూడదా?" అన్నది సహజంగా.

"నేనేం పసిపాప ననుకుంటున్నారా? నీ తలిదండ్రుల నాటకం నాకు బాగా తెలుసులే! 'టీ' కని ఆహ్వానించి. నన్ను చూసి మన విషయను తేల్చవచ్చనేగదా వాళ్ళ ప్లాను? ఆ మాత్రం తెలుసుకోలేనని అనుకున్నావా?" అని కొంచెం తీక్షణంగా అన్నాడు.

"కాని చూడాలనుకోవటం—చూడటం తప్పా? తమకు అల్లుడుకాబోయే ఆయన ఎలా వుంటాడో వాళ్ళు చూడకూడదా?" అని అమాయకంగా అడిగింది లత.

"సరేకాని- నన్ను పెళ్ళాడేది నువ్వేకదా? నన్ను నీవు చూస్తున్నావు. నీకు నేను నచ్చానని అనుకుంటున్నా. నీకు నచ్చితే అంతేచాలు. లేకపోతే మీ వాళ్లందరూ చూసి సరిపైచెయ్యంకే నన్ను ప్యాన్

"చెయ్యవా ఏమిటి?" అని పరిహాసంగా జవాబిచ్చాడు వేణు.

ఈ రోజువరకు వేణు లతవాళ్ళఇంటికి వెళ్ళలేదు. తననుగురించి ఆమెకు యేమీ తెలియచేయలేదు. జీవిత సౌఖ్యానికి ఆస్తి ధనము ముఖ్యంకావనీ ప్రేమపూరిత హృదయాలతో ఒకరినొకరు అర్థంచేసుకొనగలిగితే జీవితం ఆనందంగా గడుపవచ్చునని అతనివాదం. తమకుకాబోయే అల్లుడు ఎలా వుంటాడో అతనిసంగతి సందర్భాలు- మంచి చెడ్డలు పూర్తిగా తెలియనిదే ఈ పెళ్ళికి సమ్మతించటం ఎలా సాధ్యమౌతుందని లత తల్లిదండ్రుల వాదం. ఉభయ వాదాల్లోను మొగ్గు సమంగానే వుంది. అందుచేత ఎన్నాళ్ళనుంచో ఈ సమస్య-సమస్యగానే వుండిపోయింది.

వేణు ఒకపర్యాయం "లతా-ఇక త్వరలో మనం వివాహం చేసుకుంటేనే మంచిద"ని అన్నాడు.

"నేనుమట్టుకు కాదంటున్నానా? కాని మీ పట్టుదల మీరు వదలటం లేదుగా?" అని లత నిస్పృహతో ప్రత్యుత్తర మిచ్చింది.

"ఏమిటీ?- పట్టుదల నాదా- మీ పెద్ద వాళ్ళదా?" అని వేణు రెట్టించి అడిగాడు.

"పాపం వాళ్ళ పట్టుదల ఏముంది ఇందులో? తమ బంగారంలాంటి పిల్లను ఎవరికి తప్పగిస్తారో ఆయన ఎలాంటివారో- తెల్లగా వుంటారో నల్లగావుంటారో చూడాలని వారు భావించటం పట్టుదలఅవడం న్యాయం కాదండీ" అన్నది లత గారాబంగా.

"సరే సరే—ఆ కాబోయే అల్లుడుగారు నల్లటివాడో- తెల్లటివాడో- మంచివాడో- చెడ్డవాడో ఆవిషయాలన్నీ ఆబంగారంలాంటి పిల్లే చూసుకోగలదుగా" అన్నాడు నవ్వుతూ వేణు.

"అయినా మీకుమాత్రం ఇంత పట్టుదల యెందుకండీ? వాళ్ళ సమ్మతి లేకపోతే నేనెలా వాళ్ళని ఎదిరించగలను?" అని లత సంశయాన్ని తెలిపింది.

"ఓస్ ఇంతేనా మరి నీ ధైర్యం— రాణి సంయుక్త చూడు—తన ప్రియునికోసం తండ్రినికూడా ఎదిరించలేదా? అయినా నీవు మీ తలిదండ్రులతో చెప్పు—మీ కాబోయే అల్లుడుగారు చాలా మంచివాడూ—మీద పడ్డా పోట్లాడేరకం కాదు- కొంచెం తిక్కశంకరయ్య తత్వం అయినా పెళ్లాన్ని పూలల్లో పెట్టి పూజించుకుంటాడూ—హనుమంతుడికంటె కొంచెం బాగుంటాడు-వగైరా వగైరా అని నచ్చజెప్పి ఒప్పించి ఇరవై నాలుగు గంటలలోగా వచ్చి నన్ను పెళ్ళి చేసేసుకొనవలెను... అటుకానిపక్షమున..." అని పరిహాసం కింద తేల్చేశాడు.

"ఆ...పూర్తి చెయ్యండి ఆ వాక్యం— 'అట్లుకానిపక్షమున అబ్బాయిగారు అమ్మాయిగారిని బలవంతముగా ఎత్తుకొని వెళ్ళి, వివాహమాడ గలవారు' అని కూడా చెప్పమంటారా?...అలా అనుకుంటే సంయుక్త తండ్రిలాగా మా నాన్నగారికి మీకు ఇవ్వకూడదనే పట్టుదల లేదుగా? మా నాన్నగారికి నామీద పూర్తి నమ్మకమున్నది—నేనెప్పుడు తప్పు చేయననీ—తొందరపడి ఆలోచన లేకుండా యేపనీ చెయ్యనని ఆయన విశ్వాసం. కొంతవరకు ఆయన మీరెలాంటివారో నావల్ల తెలుసుకున్నారనుకోండి. అయినా ఆయన స్వయంగా చూస్తే ఆయనకుకూడా సమాధానంగా ఉంటుంద"ని లత సరళంగా సమాధాన మిచ్చింది.

"చూడు లతా-నా అభిప్రాయం నీకు మొదటే చెప్పేశాను. సంతల్లో గిత్తల బేరం లాగా యితరులు వచ్చి నన్ను చూసి నిర్ణయించటానికి నే నేమాత్రం ఒప్పుకోను. రైటో తప్పో యిది నా నిశ్చితాభిప్రాయం. మన మిద్దరం హృదయ పూర్వకంగా పరస్పరం ప్రేమించుకున్నాము. ఇది మన ఇద్దరి జీవిత సౌఖ్యాలకు సంబంధించిన ప్రశ్న...మనం అజ్ఞానులం......మూఢులము కాము గదా. కాబట్టి పెద్దల పట్టుదలకోసం స్వాభిప్రాయాన్ని నేను వదులుకోదలచుకోలేదు" అని తన అభిప్రాయాన్ని నిశ్చితంగా వేణు చెప్పేశాడు.

ఈసమస్య ఇలాగే యెన్నాళ్ళనుండో అపరిష్కృతంగానే వుండిపోయింది. ఇందువల్ల—పాపం—లతకు చాలా సందిగ్ధ పరిస్థితి యేర్పడ్డది. చిన్నతనంనుండి అల్లారు ముద్దుగా తనను పెంచి పెద్దదానినిగా చేసిన తలిదండ్రులను ధిక్కరించి వారికి మనఃక్లేశము కలుగజేసే ఇచ్ఛగాని, ధైర్యముగాని ఆమెకులేదు. అలాగని ప్రాణాస్పదుడైన వేణుని దూరంచేసుకోవటం అంతకంటే ఇష్టంలేదు. వాళ్ళిద్దరి పట్టుదలలవల్ల ఈమె అడకత్తెరలో వక్కలాగా నలిగిపోతూ వచ్చింది.

వేణుకికూడా ఈ సమస్య ఇలా వుండటం ఒక విధంగా బాధాకరంగానే వున్నది. లతను వదిలివుండటం అతనికి దుస్సహంగా వుంది. అంతేకాక ప్రతివారం ఎవరో ఒక కన్యాదాత తాకిడి తనకు తప్పటంలేదు. ఆ సందర్భంలో తను యేవో సాకులు చెప్పి, వాళ్ళను తిప్పిపంపటం జరుగుతూనే వుంది. ముఖ్యంగా ఈ వరాన్వేషుల గొడవ తప్పించుకోనేందుకైనా సరే తను త్వరగా పెళ్ళి చేసుకోవడం అవసర మని నిర్ణయించుకున్నాడు. కాని ఇన్నాళ్ళుగా ఒక పద్ధతి పట్టుదలతో వుండి ఇప్పుడు మెత్తబడితే లత దృష్టిలో తాను లోకువ అవుతానేమో అనే అభిమానము అడ్డుతగిలి ఆ ప్రయత్నం చేయటం విరమించాడు.


ఇప్పుడు కూడా తన ఎదుట ఆసీనులై వున్న ఆ పురాణదంపతులను చూడగానే వారు తనగృహాన్ని ఎందుకు పావనం చేస్తున్నారో అంచనా వేసుకున్నాడు. ఇన్నాళ్ళ అనుభవాన్నిబట్టి వరాన్వేషణార్థులైన వధుపితల 'ట్రేడ్ మార్కు'లు బాగా గుర్తుపెట్టుకోగలిగాడు. తన ఎదుట కూర్చొని తనవైపే సాపేక్షగా చూస్తుంటే ఆ వృద్ధమానవుల వివిధ భంగిమాలను వింతగా పరికిస్తూ, ఏమి చేయాలో తోచక కూర్చున్నాడు. వీళ్ళు కూడా తప్పక తనకు "అల్లుడిగారి హోదా" కలుగచేద్దామని వచ్చినవారేననే నిశ్చితాభిప్రాయం అతనికి కలిగింది.

ఇంతలో ఆ ముసలాయన వేణుతో, "మీ గురించిన కొన్ని వివరాలు కావలసి వచ్చాము. శ్రమ అనుకొనక తెలియజేస్తారా?" అనటంతో అతని అనుమానం రూఢియైపోయింది. వీళ్ళు తనవద్దకు వచ్చింది శుభకార్యంకోసమైతే అయివుండవచ్చు—కాని మంచి ముహూర్తం మట్టుకు చూసి రాలేదని మాత్రం ఘట్టిగా చెప్పవచ్చు...లత వచ్చేవేళ కావచ్చింది. పాసకంలో పుడకల్లాగా వీళ్ళు ఇక్కడ ఎంతసేపుంటారో తెలియకపోవటంతో వేణు లోలోపల మండిపోతున్నాడు. దానికి తగ్గట్లు ఆ ముసలాయన పలికిన మొదటి వాక్యమే అతన్ని అగ్నిలో ఆజ్యంపోసినట్లు చేసింది. ఇలాంటి వాళ్ళతో సంభాషణకు వుపక్రమిస్తే ఎంతకూ తెమలదని కొంచెం కఠోరస్వరంతోనే "క్షమించండి ...ఇప్పుడు నాకు సాధ్యపడదు. నా వివరాలు చెప్పడానికి ఉద్దేశంగాని, పావకాశంగాని లేదు" అన్నాడు.

ఈ మాట వినగానే ఆ ముసలాయన ఒక్కమారు బిగ్గరగా నవ్వి..."బలే... చూడబోతే మీరేమో తికమకపడ్డట్లున్నదే? మమ్మల్ని చూసి ఎవరైనా ఒక కన్య మాతాపిత లనుకుంటున్నారా ఏం?" అన్నాడు.

ఇది వినగానే వేణు కొంచెం తెప్పరిల్లుకున్నాడు: "అంటే మీరు 'అందుకోసం' రాలేదన్నమాట" అన్నాడు మెల్లిగా.

"కాదు. ఎంతమాత్రంకాదు" అని ఆ ముసలాయన ఇటునుండి అటు తలతిప్పుతూ గట్టిగా వక్కాణించాడు. "నిజానికి నాకు కూడ ఒక అవివాహిత కుమారిక వున్నది. మీ యూహం కూడా ఆమెకు ఇంచుమించు



"కమలా త్రీరింగ్ సర్కస్" లో ఒక దృశ్యం.

తగిపోవచ్చు. కాని ఇప్పుడు మాకు ఆ ప్రశ్న అసలు వుత్పన్నం కానే కాదు. ఈ కాలంలో ఆడపిల్లలుకూడా తమ భర్తల్ని తామే నిర్ణయించుకుంటున్నారు గదూ! అలాగే ఆమెకూడా యెవరినో ప్రేమించి నిర్ణయించుకున్నదట!! మేము మాత్రం మారు మాట లేకుండా పెళ్ళి వాళ్ళని ఆశీర్వదించాలని ఆమె అభిప్రాయం," అని తన స్వకుటుంబగాథను తెలియచేశాడు.

ఎవరైనా సరే-తమ స్వీయగాథ మొదలుపెడితే వారు కాలంవిలువ తెలుసుకోలేరు. లతి యే క్షణంలోనైనా రావచ్చు. సాధ్యమైనంత త్వరలో ఈజంటను వదిలించుకోవటం ఎంతైనా అవసరం. అందుకని వేణు ఆయన వాక్ప్రవాహానికి అడ్డుపడి "నాగురించి మీకే వివరాలు కావాలో త్వరగా తెలియచేయండి" అని అడిగాడు.

"మరేమీ లేదు...మీ కులం - వయస్సు- ఆస్తి - మీ కుటుంబం..." అని ఆయన వాక్యం పూర్తిచేయకముందే వేణు విసుగుతో" ఎందుకండీ ఈ సంగతులన్నీ మీకు... ఈ సంగతులేవీ నేను ఎవరికి తెలుపదలచలేదు. ఇవి తెలుసుకోన్నందువల్ల ఇతరులకు ఏమాత్రము వుపయోగములేదు" అనేశాడు.

"పోన్లెండి - అంతగా చెప్పదగినవి కాకపోతే ఆ సంగతి వేరు...మిమ్మల్ని ఇరుకున పెట్టటం మా వుద్దేశం కాదు" అని ఆ పరమేశ్వరుడుగారు కొంటెగా అన్నాడు.

ఈ మాట వినగానే వేణుకి బాగా కోపం వచ్చేసింది. "అవేమీ చెప్పకూడనంతటివీ-లజ్జాస్పదమైనవీ మాత్రము కావు. కాని నాకు ఇలాంటి పనిపాటలు లేని పోచుకోలు కార్యక్రమాల్లో కాలం వృథాపుచ్చటం ఎంతమాత్రం యిష్టం లేదు" అని నిర్మొహమాటంగా అనేశాడు.

ఆ ముసలాయన ఏమీ మాట్లాడలేదు.

"కాని రాష్ట్రంకోసం - దేశంకోసం - మీరు మాకు ఈ వివరాలు తెలియచేస్తే మంచిది. రాష్ట్రపతి ఆదేశాన్ననుసరించి మీకు మేము ఈ విజ్ఞప్తి చేస్తున్నాం" అని అవ్వగారు ఏదో వక పుస్తకంలోని పాఠం వప్పగించినట్లు అన్నది.

"రాష్ట్రం కోసం!...దేశం కోసం!..... చాలా వింతగా వుందే మీ ధోరణి!...నాకు సంబంధించిన వివరాలకూ - రాష్ట్రానికీ - రాష్ట్రపతికీ ఏం సంబంధముంది" అని వేణు ఆశ్చర్యంతో అడిగాడు.

అవ్వగారివైపు 'భేష్-నీ పాత్ర చక్కగా నిర్వర్తించావు' అన్నట్లు మందస్మిత వదనంతో చూసి తన తలమీది తలపాగా సర్దుకుంటూ ఆ తాతగారు అన్నారు. "ఇక ఎక్కువసేపు మిమ్మల్ని సందిగ్ధంలో వుంచటం మాకు భావ్యం కాదు. ఇప్పుడు దేశంలో జనాభా లెక్కల సేకరణ జరుగుతున్నదనే విషయం మీకు తెలిసేవుంటుందనుకుంటాను. మేము స్వయంసేవకులము. రాష్ట్రపతి విజ్ఞప్తి ననుసరించి ఇచ్ఛికంగా నే ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాము."

"ఓ-అలాగా- అయితే మీరు గణకులన్నమాట..." అంటూ "ఆమె ఎవరు?" అనే భావంతో చేట్లు అవ్వగారివైపు చూశాడు వేణు.

ఇది వెంటనే గ్రహించి ఆయన "ఆమె

# ★ స్వయంసేవకులు ★

కూడా గణకు......గణకుడు అనకండి గణిక అనండి—మొత్తంమీద ప్రభుత్వ కార్య నిర్వహణభారాన్ని నాతోపాటు భుజస్కంధాలమీద వేసుకొన్న స్వయంసేవకురాలు. ఇంట్లో ఎవరైనా స్త్రీజనం వుంటారేమో — వారిని కూడా విచారించి కొంత వివరణ సేకరించవచ్చునేమో ననే భావంతో వచ్చింది. కాని సాధారణంగా ఆమె చేసే పని అంతగా వుండదులెండి. ముఖ్యమైన పనంతా చెయ్యవలసింది నేనేగదా!" అంటూ తన హాస్యపూరిత సమాధానానికి తానే నవ్వుకుంటూ వేణువైపు ప్రశ్నార్థకంగా చూచాడు.

"ఏం అలా అంటారు?— ఇక్కడ లేకపోతే చాల ఇళ్ళలో స్త్రీలుంటారు గదా — ఆమెకు మాత్రం పని తక్కువగా వుంటుందా?" అని వేణు అడిగాడు.

"ఆ...ఏం పనిలెండి ... ఆడవాళ్ళపని ఏముంటుంది...పూరికే తలలు లెక్కపెట్టటమేగా...అయినా వాళ్ళ తలల్లో గాని, నోట్లోగాని ఏ విషయాలైనా ఎంతసేపు స్థావరంగా వుంటాయి గనుక!" అని తమాషాగా అవ్వగారిని కవ్వించాలని అన్నాడు.

"ఇక ఈ వేళాకోళాలు చాలించండి" అంటూ ఆమె ఆయనను కోపదృష్టితో చూసింది. కాని ఆయన నిర్లక్ష్యం చేస్తూ "నిజమే...ఇక హాస్యం సరిపుచ్చి అసలు కార్యరంగంలోకి వద్దాం. ఇప్పటికే చాలా ఆలస్యమయింది," అన్నాడు.

"నిజమేనండి. మీ పని త్వరగా ముగించండి. మీరు ఇక్కడిలాగా అన్ని చోట్ల ప్రజలతలలు లెఖ్ఖపెట్టటం మొదలుపెట్టే వాళ్ళతలలే తిరిగిపోతాయి" అని కొంచెం విసుగుతో వేణు అన్నాడు.

"అవునవును. ఆ సంగతీ నిజమే..." అని ఆ ముసలాయన అవ్వగారిని వుద్దేశించి... "చూశావా...ఆయన మన వాచాల ధోరణిమీద ఎంత పసందుగా దెబ్బకొట్టారో?" అంటూ తన నల్లకోటు జేబులోని ఒక అచ్చుఫారము తీసి ... "చూడండీ...ఇందులోని ప్రశ్నలకు మీరు సరిగా జవాబులు చెప్పాల్సివుంటుంది. శ్రమ అనుకోక చెప్తారు కదూ?" అంటూ దానిమీది ప్రశ్నలు అడగటం ప్రారంభించాడు.

"మీ పేరు?"

"వేణుగోపాల్ రావు."

"మీ తండ్రి?"

"రఘునాధరావు."

"మీ జాతీయత్వం-మతం?"

"భారతీయులు-హిందూ."

"కులం?"

"బ్రాహ్మణులు"

"శాఖ?"

"నియోగులు"

"గోత్రం?"

వేణు కొంచెం చిరాకు చూపుతూ "జనాభా లెక్కల్లో ఈ వివరాలెందుకండీ- అయినా అడిగారు కాబట్టి చెప్తున్నా-మాది భారద్వాజగోత్రం" అన్నాడు.

"సరే. ఇక్కడ మీరు-మీ భార్య కాక ఎంతమంది వున్నారు? మీకు సంతానమెందరు?" అని వేణుని చూసీ చూడనట్లు చూస్తూ అడిగాడు.

"నాకు ఇంకా పెళ్ళి కాలేదండి... అందుచేత సంతానం సంగతి ప్రశ్నే వుత్పన్నం కాదు" అన్నాడు వేణు.

"అలాఅయితే త్వరగా పెళ్ళిచేసుకోండి" అని అవ్వగారు అక్కడ తన అస్తిత్వాన్ని తెలియచేసేందుకన్నట్లు మాట్లాడింది.

"వద్దువద్దు-ఆపనిమటుకు మీరు చేయవద్దు. నిజంగా తెలివిగలవారెవరు ఈ కాలంలో ఆడవారి ప్రమేయం పెట్టుకోరాదు. ప్రపంచ జనాభా చాలా పెరిగిపోతున్నదనీ-ఇప్పటి వారికే ఆహారము చాలటంలేదు కాబట్టి ప్రతివారు కుటుంబ నియంత్రణ చేయాలని ప్రభుత్వము ఆదేశిస్తున్నది. కాబట్టి ఆమెగారి మాటలు మీరు యేమాత్రం పాటించవద్దు. వారి జాతి వుచ్చుల్లో మీరు ఒక్కమారు చిక్కుకున్నారా మళ్లా తప్పించుకోలేరు...ఇప్పుడు ఈ ఉపన్యాసం ఎందుకులెండి - ఇక చెప్పండి - మీ వయస్సెంత?" అని ఆ గణకుడు అడిగాడు.

"ఇరవై ఆరు సంవత్సరాలు"

"మీ జన్మస్థలం?"

"రాజమండ్రి"

"మీ మాతృభాష?"

"తెలుగు"

"ఇంకా ఇతర భాషలేమైనా మాట్లాడుతారా?"

వేణుకు ఇప్పటికే ఈయన ధోరణి విసుగు పుట్టిస్తోంది. ఇలా సాగనిస్తే తన కార్యక్రమమంతా భగ్నమైపోయేట్లుంది. అందుకని ఇక నోటికి వచ్చిన సమాధానాలు చెప్పి వాళ్ళను త్వరగా వదిలించుకోవాలనుకుంటున్నాడు. ఇంతలో ఆ ముసలాయన మళ్లా "ఏమిటో ఆలోచిస్తున్నారే? ఇతర భాషలేమైనా మాట్లాడుతారా అని అడిగానండి" అన్నాడు.

ఈ హెచ్చరికతో వేణు ఓర్పు సన్నగిల్లింది..."అవు - మాట్లాడుతానండీ-ప్రేమభాష" అన్నాడు హేళనాస్వరంలో.

"భలే...చాల మంచి భాషే నే ... అయితే ఇది చాలా పాతభాష...అయినా మీ బోటివారు అవస్యం అదేమాట్లాడాల్సింది. ...సరే...మీరు స్వతంత్రంగా వుంటున్నారా లేక ఇతరులమీద ఆధారపడి జీవనయాత్ర సాగిస్తున్నారా?...

"స్వతంత్రంగానే జీవిస్తున్నాను."

"అంటే స్వతంత్ర యజమానియా - లేక, యజమానివద్ద స్వతంత్రి ఉద్యోగిగానా లేక స్వతంత్ర కార్మికుడుగా వుంటున్నారా?"

"ఒక్కొక్కప్పుడు యజమానిగా వుంటాను—ఒక్కొక్కప్పుడు సేవకుడుగా కూడా వుంటాను-"

"అంటే...?"

"ఆ...ఏమీ లేదు. నామట్టుకు నేను స్వతంత్రుణ్ణే—కాని...కాని..."

"చెప్పండి. పరవాలేదు ... ఈ వివరాలన్నీ సేకరించి మిమ్మల్ని కోర్టుకు ఈడుస్తామని యేమీ భయపడనవసరంలేదు. అలాగని ప్రభుత్వం తరఫున మేము మీకు ఘట్టిగా హామీఇస్తున్నాం," అన్నాడాయన గంభీర వదనంతో. కళ్ళజోడునుంచి తల ఎత్తకుండా చూస్తూ.


## అతిమూత్రవ్యాధి నెమ్మదించును

మూత్రంలో చక్కెరపోవటం అతిమూత్ర వ్యాధి (DIABETES) అంటారు. ఇది ఎంత ఉపద్రవకరమైన వ్యాధి అంటే, దీని పాలబడినవారు ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నమౌతుంటారు ఈజబ్బు లక్షణాలలో ముఖ్యమైనవి ఎక్కువగా దాహం, ఆకలి, తరచుగా చక్కెరతోగాని, లేక చక్కెరలేకుండగాని మూత్రం బయలు వెడలటము, దురద మొదలైనవి. వీనస్ ఛారమ్ అనేక సంవత్సరముల పరిశోధనల ఫలితంగా తయారు కాబడినది. దీన్ని వాడటంవల్ల వేనకు వేల మందిమృత్యుముఖమునుండి బయటపడ్డారు దీన్ని వాడితే గండపలేక మూడవ రోజు నుండేమూత్రంలో చక్కెర తగ్గించి. అత్యధిక మూత్రంకూడా నివారిస్తుంది మూడురోజుల తర్వాత మీకు బాగా తేలిక ఇస్తుంది దీనికి పత్యంలేదు. ఇన్ జెక్షన్లు అవసరం లేదు. వివరములు గల ఇంగ్లీషు కరపత్రానికి వ్రాయండి. ఉచితంగా పంపెదము.

50 బిళ్లల బుడ్డి ఖరీదు రు. 6-12-0 లు.

ప్యాకింగు పోస్టేజి ఉచితము.

Venus Research Laboratory(A.P.W)
P. O. Box No, 587, Calcutta.

"అబ్బే...నాకో భయంలేదు...మీరతి గారు గాబట్టి చెప్పక తప్పదు. నేను స్వతంత్రుణ్ణే అయినా, ప్రస్తుతానికి ఒక అమ్మాయికి మాత్రం దాసుణ్ణి."

ఆయన వ్రాయటం ఆపి నవ్వుతూ, "భేష్—భలే చక్కని సంగతి చెప్పావయ్యా...శ్రీకృష్ణ పరమాత్ముడిలాగా అనాది ఆచారాన్ని అమలులో పెట్టున్నారన్నమాట...ఇంకెం ఎక్కువరోజులు ఆ అమ్మాయికి దాసుడుగా వుంటే ప్రమాదం—త్వరగా యజమానికండి" అని అవ్వగారి వైపు చూసి... "ఈయనగారు ఎలాగైనా నీమాటే ఖాయం చేసేట్లున్నారే" అన్నాడు.

అవ్వగారు తనకు మాట్లాడేందుకు వచ్చిన ఛాన్సును వదులుకోవటం ఎందుకన్నట్లు "అవును మరి — మేము మాట్లాడేవన్నీ ఖాయమయ్యేమాటలే. మీలాగా మా స్త్రీజాతి నోటిలోంచి ఊకదంపుమాటలు అస్సలు రావు" అని తాతగారిమాట తిప్పి వప్పగించింది.

"సరే యిక ఈ ఊకదంపు మాటలుఆపి అస్సలుసంగతికి వద్దాం. ఇంక పది ప్రశ్నలు మాత్రం వున్నయి -త్వరగా చెప్పెయ్యండి" అన్నాడా ముసలాయన.

"అబ్బ—పదిప్రశ్నలే!...త్వరగా కానియ్యండి...నాకు వేరేపనుంది," అని ఇక ఓర్చుకోలేక అనేశాడు వేణు.

"అవును—గ్రహించాం—ఇక ఆలస్యం లేదు. చెప్పండి మీ నెలజీత మెంత?"

"సుమారు మూడు వందల దాకా వుంటుంది."

"ఇంకా ఇతర ఆస్తి యేమైనా వుందా?"

"అయ్యో—జనాభా లెఖ్ఖలకూ-ఆస్తి ఆయివేజులతో ఏమి సంబంధం?" అని అడిగాడు వేణు కొంచెం సంశయంతో.

"ఏమోనండీ-నాకుమటుకు ఏమి తెలుసు-ఫారం చూసి అడుగుతున్నాను. వీలుంటే చెప్పండి రాసుకుంటాను. లేకపోతే ఆ కాలం ఖాళీగావుంచేస్తాను," అన్నాడు.

"వున్నదండి. ఇల్లు—భూస్థితి కలసి సుమారు నలభైవేల విలువ ఆస్తి వుంది."

"అంటే ఇప్పుడు మీ స్వాధీనములో వుందా?"

"లేదు. మా తండ్రిగారు చూస్తుంటారు."

"మీరు అన్నదమ్ము లెందరు?"

"ఇద్దరు."

"అక్క చెల్లెండ్రు?"

"లేరు."

"చదువను వ్రాయను వచ్చా?"

"ఎవరికి?"

"మీకు," ఫారం చూస్తూ నవ్వుతూ అడిగాడు.

"ఏమో గట్టిగా చెప్పలేను," వేణు కూడా



"కమలా త్రిరింగ్ సర్కస్"లో రాధాకృష్ణ నృత్యం చేస్తున్న బెల్జియన్ సోదరీమణులు రోసినా, మార్గరెట్.

అలాగే జవాబిచ్చాడు.

"మీ విద్యాయోగ్యత అంటే క్వాలిఫికేషన్ ఏమిటి?"

"కెమిస్ట్రీ ఎం. ఎస్. సి."

"స్త్రీయా-పురుషుడా?" తిరిగి అచ్చుఫారం చూసి నవ్వుతూ అడిగాడు.

"ఎవరు-నేనా-మీ రెవరనుకుంటే అదే రాసుకోండి," అని నవ్వుతూ వేణు తిరుగు సమాధాన మిచ్చాడు.

"సరే- ఇక మాపని అయిపోయింది" అంటూ ఆయన ఆ కాగితాన్ని మడచి కోటుజేబులో పెట్టుకున్నాడు.

ఇప్పటికి ఈ అగ్నిపరీక్ష ముగిసినందుకు వేణు చాల సంతోషించాడు. ఇక "వీళ్ళు వెళ్ళిపోతే బాగుండున" నే భావం వ్యక్తపరచే దీనదృష్టితో వీళ్ళవైపు చూశాడు ఆయన అది గ్రహించి. ఆమెను, "ఇంక అడుగవలసినవి యేమీ లేవుగా" అని ప్రశ్నించాడు.

"ఏమీ లేవ"ని ఆమె తలవూపింది.

"మీకు శ్రమ ఇచ్చాం. కావలసిన విషయాలు చాలా ఓపికగా తెలిపారు. చాల మంది మీలాగా ఇంత నిదానంగా వుండరు" అంటూ ఆయన తలపాగా సవరించుకొని వుత్తర్యం భుజంమీద వేసుకొని లేచాడు. ఆయన ననుసరించి ఆమెకూడా లేచింది.

"ఈయన ఎవరికోసమో ఎదురుచూస్తున్నట్లున్నారు. మధ్య మన ముసలివాళ్ళ గొడవెందుకు?" అని వేణువైపు కొంటెగా చూస్తూ, "గుడ్-బై" చెప్పి గుమ్మం దాటి

# ★ స్వయంసేవకులు ★

మెట్లుదిగి వెళ్ళిపోయాడు. ఆయన వెనకనే ఆమెకూడా మందగమనంతో నడక సాగించింది. కొంచెంసేపు వేణు వారివంక చూస్తూ ఇంత వయస్సులో కూడా దేశంకోసం స్వయంసేవకులుగా శ్రమపడేవారి ఓపికను మెచ్చుకుంటూ, వరండాలో నిలబడ్డాడు. జనాభా లెఖ్ఖలు తయారుచేసేందుకు ప్రభుత్వంవారు ఇలాంటి వృద్ధులకుకూడా శ్రమ కలిగిస్తున్నందుకు కొంత విచారించినా వారు తమ కార్యనిర్వహణ అతి నేర్పుతో చేస్తున్నందుకు వారిని అభినందించకుండా వుండలేకపోయాడు!!!

గదిలోకివెళ్ళి గడియారం చూసాడు. సుమారు ఆరుగంటలు కావచ్చింది. నిరాశతో మళ్ళా వరండాలోకి వచ్చి తనదృష్టి ఎంత దూరం ఆనుతుందో అంతదూరం సారించి చూసాడు. కాని లత వస్తున్న జాడ యేమీ కనపడలేదు. ఇక చేసేదేమీ లేక మళ్లా గదిలోకి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. కాని అతని మెదడు పనిచేయటం పూర్తిగా మానేసినట్టనిపించింది. 'ఈ రోజునసైనా లత తన కోరిక నంగీకరిస్తుందా లేక ఆమె పెద్దల మూర్ఖపు పట్టుదలకు లొంగిపోయి తనను నిరాకరిస్తుందా?' అనే ఆలోచన అతనిని వేధించ సాగింది. మామూలుగా వచ్చి "నన్నేం చేయమంటారు? మావాళ్ళ మాట నేను కాదనలేను. నన్ను మరచిపొండి" అని చెప్పి దుఃఖంతో వెనక్కి తిరిగిపోతే తన కర్తవ్యం యేమిటి?? అతను ఆమెను వదులు


## తెల్ల వెంట్రుకలుండవు

(GOVT REGD).

రంగులనుచూచి మోసపోవద్దు, అది తాత్కాలికము. మా సువాసన "విశ్వకళ్యాన్ తైలం" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారైనది. 50 సం॥ల వయస్సువరకు వెంట్రుకలను నల్లగా వుంచును. ఇదిగాక మెదడుకు చల్లదనమునిచ్చును ఉన్మాదము, తలనొప్పి వగైరా జబ్బుల రానీయదు. జ్ఞాపకశక్తిని కంటిచూపును వృద్ధి చేయును. కొద్దిగా నెరసివుంటే ఒక సీసా రు. 5/- 3 సీసాలు రు. 12, సగము నెరసి వుంటే ఒకసీసా రు.6/- 3 సీసాలు రు.15/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రు. 7/-లు 3 సీసాలు రు. 18/-లు పని చేయలేదని ఋజువుపర్చిన పూర్తి సొమ్ము వాపసు చేయబడును. కోరినవారికి ఫ్రీ.

MODERN DRUGS CORPN
(106) P. O. Pakribardwan (Gaya)


కుంటాడా?...కాదు...ఈ రోజుతో ఈ సమస్య నెలాగైనా పరిష్కరించాలి— అంతగా అవసరమైతే తనే వెళ్ళి లత తలిదండ్రులకు కనపడి ఆమెను తనదానినిగా చేసుకోవాలి...ఇలా ఈ నిర్ణయానికి వచ్చిన తర్వాత అతని మనస్సుకు కొంత శాంతి లభించింది. అయినా లత యింతవరకు ఎందుకు రాలేదో కారణం తెలియక ఆలోచిస్తూ కూచున్నాడు.

కొంచెంసేపయిన తర్వాత లత వచ్చింది. ఆమెను చూడగానే అతనికి నూతనోత్తేజం కలిగింది అంతక్రితంవరకు అతని మొహాన అలుముకొన్న విచారఛాయలు విచ్చిపోయినయి ఈ రోజు ఆమె ఎంతో ఉత్సాహంగా ఆనందంగా కనపడింది. లత గదిలో కాలుపెట్టగానే వేణు మొట్టమొదటి ప్రశ్న "లతా—ఏమిటీ ఇంత ఆలస్యం చేశావు?" అని.

"నిజమే ఆలస్యమైంది. నే నేం చేసేది! నేను ఎప్పుడో బయలుదేరాను; కాని తీరా వస్తుండగా మా అమ్మ నాన్న వచ్చి "మేము ఇప్పుడే కొంచెం బయటకు వెళ్ళవస్తాము. మేము వచ్చినతర్వాత వెళ్దువుగాని ఇంట్లో వుండమని చెప్పి వెళ్ళారు. వాళ్ళు ఇంటికి రాగానే నేను, ఇటు పరిగెత్తుకొని వచ్చేను" అని అతన్ని సమాధాన పరచింది.

"అబ్బ—ఈ ముసలివాళ్ళకు ఇప్పుడే వూళ్ళమీద వూరేగాలని మనసు కలిగిందీ? నిజంగా లతా నీవు ఆలస్యం చేసినందుకు నాకు నీమీద ఎంతకోపం వచ్చిందో తెలుసా?" అన్నాడు వేణు తన ఆతృతను వ్యక్తపరుస్తూ.

"ఓ- తెలియకేం?...మీకోపం చిచ్చుబుడ్లలాగా నిమిషం-అయినా అదికూడా నన్ను చూసేంతవరకేనని కూడా నాకు బాగా తెలుసులేండి...ఇవ్వాళ మీకోసం ఒక చల్లనివార్త మోసుకొని వచ్చానుగా..." అని లత సంతోషంగా సమాధాన మిచ్చింది.

"నిజంగానా...ఆ కమ్మనివార్త ఏమిటో త్వరగా చెప్పెయ్యరాదు విసిగించకుండా..." అని వేణు తన సంతోషాన్ని ఆతృతను వ్యక్తపరిచాడు.

"నిజమే...మన వివాహానికి మా అమ్మ నాన్న సమ్మతించారు," అని లత చెప్పగానే వేణు ఆనందంతో ఒక్కమారు లేచి వెళ్ళి ఆమెను సోఫాలో కూలేసి ఆప్యాయంగా ఆమెభుజం పట్టుకొని ఊపుతూ "అమ్మయ్యా బ్రతికించావు ... ఇందాకటినుండి మీవాళ్ళు ఒప్పుకోకపోతే ఏమి చెయ్యాలీ అని ఆలోచించి ఆలోచించి నాబుర్ర వేడెక్కిపోయిందిగదా! చూశావా మరి మన ప్రతాపం! వాళ్ళు ఎలాగూ ఒప్పుకుంటారని నాకు ఎప్పుడో తెలుసు!! వాళ్ళకు వేరే గత్యంతరం లేదు మరి!!! ముసలివాళ్ళ పట్టుదలలు ఎంత మూర్ఖమైనవో అర్థంలేనివో ఇప్పటికైనా బాగా తెలుసుకున్నావా? 'మావాళ్ళు మిమ్మల్ని చూడాలి-వాళ్ళు చూపిందే మన పెళ్ళి సాధ్యంకాదు' అని నీవు కూడా మూర్ఖంగా నన్ను ఇన్నాళ్ళు అనవసరంగా వేధించావుగదా!" అని సగర్వంగా తన ఆవేశాన్ని అణచుకోలేక అన్నాడు.

"మావాళ్ళకి మీరు నచ్చారు...అందుకనే వాళ్ళు ఒప్పుకున్నారు" అన్నది లత నిదానంగా నవ్వుతూ వేణు విజయగర్వాన్ని అణచాలని.

"అంటే?...మీవాళ్ళు నన్ను చూసినట్లు మాట్లాడుతున్నావే?"

"ఆ...చూడటమే కాదు...మీ సంగతులన్నీ కూడా వాళ్ళకు తెలుసు."

"ఛా...అదెప్పుడూ సాధ్యం కాదు. వాళ్ళు నన్నెప్పుడు చూశారు? ఊరికే చెప్పకున్నారంటే నిన్నూ, వాళ్ళనికూడా లోకువచేసి ఆటలు పట్టిస్తానని బుకాయిస్తున్నావులే! అంతమాత్రం తెలుసుకోలేనూ?" అన్నాడు.

"అదేమీ కాదులెండి - అన్నీ వాళ్లకు తెలుసు - చెప్పనా?...మీకు నెలకు మూడు వందల రూపాయల జీతం-మీరు నియోగి బ్రాహ్మణులు — భారద్వాజ గోత్రోద్భవులు - మీకు నలభైవేల ఆస్తి ఉన్నది - ఇంకా...."

"చాల ఆశ్చర్యంగా వుందే...ఇవన్నీ నీకు ఎలా తెలుసు" అని వేణు విస్మయచకితుడై అడిగాడు.

"ఇంతేకాదు....ఇంకా చాలా తెలుసులేండి నాకు..."

"ఏం తెలుసో...చెప్పు వింటాం"

"మరే...పాపం-మరే...తమరు ప్రేమ భాష మాట్లాడుతారట...ఇంకా...ఇంకా ఎవరో ఒక అమ్మాయికి దాసుడుగా కూడా వుంటున్నారట...అవునా?" అంటూ లత విరగబడి నవ్వుతూ కవ్విస్తూ కొంటెగా అడిగింది.

"ప్రేమభాషా??....ఒక అమ్మాయికి దాసుడు?...ఆ... తెలిసింది - అమ్మదొంగల్లారా...భలే స్వయంసేవకులే...?...ఎంత మోసం చేసారు ఆ ఆది దంపతులు...." అంటూ వేణు కూడా బిగ్గరగా నవ్వుతూ లతను దగ్గరతీసుకొని ఆనందాతిరేకంతో గట్టిగా తన హృదయానికి చేర్చుకున్నాడు.

ఆ గదంతా ఒక్కమారు పూర్ణ శరత్ చంద్రిక ప్రసరించినట్లు మిలమిల్లింది!!! ★